క్లుప్తంగా

సీహెచ్‌సీకి సర్జికల్ కిట్ల వితరణ



వైద్యులకు సర్జికల్ కిట్లు అందజేస్తున్న తోరాటి

కపిలేశ్వరపురం: అంగర గ్రామానికి చెందిన శిల్ప కళాకారుడు తోరాటి శ్రీనివాస్ కపిలేశ్వరపురం సీహెచ్‌సీకి సర్జికల్ కిట్లు, బెడ్‌షీట్లు శుక్రవారం విరాళంగా అందజేశారు. ఆసుపత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ రాజ్‌కుమార్, ఇతర వైద్యులకు శ్రీనివాస్ తదితరుల చేతుల మీదుగా వాటిని అందజేశారు. వైద్యులు శ్రీనివాస్‌ను అభినందించారు. కార్యక్రమంలో పిల్లా బసవరాజు, దానేటి శరత్, ఆలపాటి నారాయణమూర్తి, సుధా తేజ పాల్గొన్నారు.

చెకుముకి పరీక్ష పోస్టర్ ఆవిష్కరణ



ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్‌లో చెకుముకి ప్రతిభా పరీక్షల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

రామచంద్రపురం రూరల్: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ, సృజనాత్మకతను వెలికితీసేందుకు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఏటా నిర్వహించే చెకుముకి ప్రతిభా పరీక్ష పోస్టర్‌ను ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామచంద్రపురం రూరల్ చెకుముకి పరీక్షల కన్వీనర్ రెడ్డి కనక రాజశేఖర్ వివరాలు వెల్లడించారు. ఈ నెల 25న పాఠశాల స్థాయిలో, అక్టోబర్ 27న జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ పరీక్షల్లో 8, 9, 10 తరగతులు చదివే విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రత్న పద్మావతి, జిల్లా సైన్స్ అధికారి గిరజాల వెంకట సత్య సుబ్రహ్మణ్యం, జన విజ్ఞాన వేదిక గౌరవాధ్యక్షురాలు పసుపులేటి మెహర్ సుజాత, సైన్స్ ఉపాధ్యాయులు గుణ్ణం సత్తిబాబు, చల్లా భవాని తదితరులు పాల్గొన్నారు.


మండలంలో 99 శాతం పంట నమోదు



రాయవరంలో పంట నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న ఏవో ప్రభాకర్

రాయవరం: మండలంలో ఇంతవరకూ 99 శాతం పంట నమోదు పూర్తి చేసినట్టు ఏవో కొప్పిశెట్టి ప్రభాకర్ తెలిపారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో పంట నమోదు చేయించుకున్న రైతుల బయోమెట్రిక్ తీసుకునే ప్రక్రియను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ మండలంలో 14,645 ఎకరాల్లో వరి పంట సాగు చేయగా, ఇప్పటి వరకూ 14,319 ఎకరాల్లో పంట నమోదు చేశామన్నారు. పంట నమోదు చేసిన 5,489 మంది రైతులు బయోమెట్రిక్‌ను పూర్తి చేశారన్నారు. పంట నమోదుకు, బయోమెట్రిక్‌కు ఈ నెల 23వ తేదీ తుది గడువుగా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. పంట నమోదు చేయించుకున్న రైతులు బయోమెట్రిక్‌ను పూర్తి చేసుకోవాలని ఆయన సూచించారు. నిర్ణీత గడువులోగా పంట నమోదు, బయోమెట్రిక్ చేయించుకోకుంటే పంటను మద్దతు ధరకు అమ్ముకోవడానికి, ప్రకృతి వైపరీత్యాలు వచ్చినపుడు పంట నష్టపరిహారం, పంటల బీమాను కోల్పోతారన్నారు.

పచ్చని చెట్లకు గడ్డి మందు



ఓదూరులో గడ్డి మందు కొట్టడంతో మాడిపోయిన చెట్లు

రామచంద్రపురం రూరల్: మండలంలోని ఓదూరు శివారు గెయిల్ ఇండియా కార్యాలయానికి వెళ్లే రహదారిలో పంచాయతీకి చెందిన మామిడి చెట్లకు కొందరు దుండగులు గడ్డి మందు కొట్టారు. దీంతో పచ్చని చెట్లు మాడిపోయాయి. కొందరు కావాలనే చెట్లకు గడ్డి మందు పిచికారీ చేసి పంచాయతీ ఆదాయానికి గండి కొట్టారని గ్రామస్తుడు, యనమదల ఏపీసీఎస్ మాజీ వైస్ ప్రెసిడెంట్ రొక్కాల సూర్యారావు(యేసేపు) ఆరోపించారు. గత మూడు సంవత్సరాలుగా పంచాయతీలో ఈ చెట్లకు వేలం పాటలు నిర్వహిస్తున్నారన్నారు. పచ్చని చెట్లకు మందు కొట్టిన నిందితులపై పంచాయతీ అధికారులు, ఉద్యానవన శాఖ చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

జీఓ 117ను రద్దు చేయాలి

మామిడికుదురు: ప్రభుత్వ స్కూళ్లను నిర్వీర్యం చేసిన జీఓ 117ని రద్దు చేయాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు డి.సురేష్‌బాబు డిమాండ్ చేశారు. పాశర్లపూడి, మామిడికుదురు జెడ్పీ ఉన్నత పాఠశాలల వద్ద శుక్రవారం పీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మండల శాఖ అధ్యక్షుడు వై.పల్లంరాజు ప్రారంభించారు.

వంద రోజులకే బెంబేలు..

- సంక్షేమం అమలుపై చేతులెత్తేసి కూటమి ప్రభుత్వం
- అధినేతల నుంచి నియోజకవర్గ నేతలిచ్చిన హామీలు తూచ్
- నేటి వరకూ అందని తల్లికి వందనం తదితర లబ్ధి
- హామీల అమలుకు దూరంగా మంత్రి సుభాష్
- అదే బాటలో ఎమ్మెల్యే వేగుళ్ల
- జగనే మెరుగు అంటున్న సామాన్యులు
- 'కూటమి' వంద రోజుల పాలనపై ప్రజలు పెదవి విరుపు



వెదురుమూడి చర్చి వద్ద గుంత, చెత్తతో అధ్వానంగా ఉన్న రహదారి



ప్రత్యామ్నాయ డంపింగ్ యార్డుగా వినియోగిస్తున్న అంగరలోని హైస్కూల్ పక్కన కాలువ గట్టు



వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇంటికెళ్లి చికిత్స చేస్తున్న డాక్టర్ రత్నకుమారి (ఫైల్)



కూటమి ప్రభుత్వంలో విష జ్వరాలతో వాకతిప్ప పీహెచ్‌సీని ఆశ్రయిస్తున్న జ్వర పీడితులు

కపిలేశ్వరపురం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులైంది. ఎన్నికల ప్రచారంలో సంపద సృష్టికర్తనని చెప్పుకున్న చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయ్యాక సంక్షేమ పథకాలు అమలు చేయడానికి ఖజానా ఖాళీ అంటున్నారు. కూటమి హామీలకు నాదీ హామీ అని చెప్పిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నోరు విప్పడం లేదు. ఈ నేపథ్యంలో సంక్షేమ క్యాలెండర్ ప్రకటించి చెప్పిన తేదీలకల్లా సాయం సొమ్మును పారదర్శకంగా లబ్ధిదారుల ఖాతాకు జమ చేసిన వైఎస్ జగన్ ప్రభుత్వాన్ని సామాన్య ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు. దాని నుంచి ప్రజలను ఏమార్చేందుకు జగన్ హయాంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల సందర్భంగా ఆవిష్కరించిన శిలాఫలకాలను ధ్వంసం చేస్తున్నారు. వంద రోజుల కూటమి పాలనపై ఈ కథనం....

'కూటమి' నేతల హామీలివి..

ఈ ఏడాది మార్చి 9న రామచంద్రపురం రూరల్ హసనబాదలోనూ, ఏప్రిల్ 3న ద్రాక్షారామలోనూ, జనవరి 20న మండపేట పట్టణంలోనూ టీడీపీ అధినేత చంద్రబాబు ప్రజాగళం యాత్రలో పలు హామీలు ఇచ్చారు. ఏప్రిల్ 26న ద్రాక్షారామ సభలోనూ, మే 1న మండపేట సభలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ మాట్లాడుతూ కూటమి హామీలకు తాను హామీ ఇస్తున్నానంటూ గట్టిగా చెప్పారు. ఆయా సభల్లో చంద్రబాబు మాట్లాడుతూ ధరలు తగ్గిస్తానని చెప్పగా వారి వంద రోజుల పాలనలో బియ్యం, ఉల్లిపాయలు, వంట నూనెల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ద్రాక్షారామలో వర్క్ ఫ్రం హోం ఉద్యోగులకు వృత్తి నిర్వహణకై ఒక సాంకేతిక కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామన్న హామీకి అతీగతీ లేదు. కోటిపల్లి-కుమ్మరివారి సావరం మధ్య కుంగిపోయిన గౌతమి గోదావరి ఎడమ గట్టు పటిష్టం చేస్తామన్నారు. రామచంద్రపురం, మండపేట పట్టణాల్లో టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అందజేస్తామని చెప్పినప్పటికీ నేటి వరకూ రామచంద్రపురంలో మొదటి విడతకు చెందిన 1,088, మండపేటలో రెండో విడతలకు చెందిన 6,128 గృహాల్లో పూర్తిస్థాయిలో లబ్ధిదారులతో భర్తీ కాలేదు. రహదారులను అద్దంలా మారుస్తామని చంద్రబాబు చెప్పినప్పటికీ మండపేట-కపిలేశ్వరపురం, వెదురుమూడి-సంధిపూడి, తాతపూడి-కపిలేశ్వరపురం రహదారులు గుంతలమయంగానే ఉన్నాయి. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని హామీ అమలుకై రామచంద్రపురం అర్బన్, రూరల్ మండలంలో 364, కె.గంవరం మండలంలో 265, కాజులూరు మండలంలో 278 మంది ఉపాధ్యాయులు ఎదురు చూస్తున్నారు. వలంటీర్ల జీతాలను రూ.10 వేలకు పెంచి విధుల్లో కొనసాగిస్తామని ఇచ్చిన హామీ అటకెక్కింది. సాగునీటి సంఘాలను ఏర్పాటు చేస్తామని చెప్పినప్పటికీ నేటి వరకూ కార్యాచరణ చేపట్టలేదు. స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దుతామని ఇచ్చిన హామీ ఆచరణలో కానరావడం లేదు. ప్రముఖ పుణ్యక్షేత్రం ద్రాక్షారామ, వెలంపాలెం, తోటపేట, అన్నయ్యపేట, హసనబాదలో డంపింగ్ యార్డులు లేక రోడ్లపై చెత్త దర్శనమిస్తోంది. కె.గంగవరం మండలం యండగండి, పామర్రు, పాణింగపల్లి, సత్యవాడ, కుందూరు, మసకపల్లి, దంగేరు గ్రామాల్లోనూ, కపిలేశ్వరపురం మండలం అంగర, పడమర ఖండ్రిక, కపిలేశ్వరపురం, వల్లూరు గ్రామాల్లోనూ, మండపేట మండలంలోని 12 గ్రామాల్లోనూ డంపింగ్ యార్డులు లేక పారిశుధ్యం లోపిస్తోంది.

ఆచరణకు నోచుకోని సుభాష్ హామీలు



మంత్రి వాసంశెట్టి సుభాష్

- కోటిపల్లి - నరసాపురం రైల్వే వంతెన నిర్మాణాన్ని పూర్తి చేస్తాం.
- రామచంద్రపురం-అమలాపురం మధ్య దూరాభారాన్ని తగ్గించేందుకు గోదావరి నదిపై కోటిపల్లి-ముక్తేశ్వరం రోడ్డు వంతెన నిర్మాణానికి కృషి. నియోజకవర్గంలోని 1.02 లక్షల మంది మహిళలు, 18 వేల మంది బాలికలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం.
- నియోజకవర్గంలోని 84 వేల కుటుంబాలకు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితం. రామచంద్రపురం నియోజకవర్గంలోని 77 గ్రామాల్లోని ప్రతి ఇంటికీ రక్షిత తాగునీటి సౌకర్యం కల్పిస్తాను.
- నియోజకవర్గంలోని చేనేత ఉత్పత్తులపై జీఎస్టీ చెల్లింపులను రీయింబర్స్ చేయిస్తాం.దేవాలయాల్లో పనిచేసే నాయీ బ్రాహ్మణులకు రూ.25 వేల గౌరవ వేతనం, వారి దుకాణాలకు 200 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ అందిస్తాం.

వేగుళ్ల హామీలు..



ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు

- మండపేట నియోజకవర్గాన్ని తూర్పు గోదావరి జిల్లాలో కలుపుతామంటూ ఏప్రిల్ 23న రాయవరం మండలం వి.సావరం, వెదురుపాక, నదురుబాద, రాయవరం, లొల్ల గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో ప్రస్తుత ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఎన్నికల ముందు హామీ ఇచ్చారు. రాయవరం మెయిన్ రోడ్డును, మెయిన్ స్కూల్‌ను మెరుగు పరుస్తాను. ఆప్కోద్వారా చేనేత వస్త్రాలను కొనుగోలు చేస్తామని, సొసైటీల బకాయిలను పూర్తిగా చెల్లిస్తామని, సంక్రాంతి కానుకగా చేనేత వస్త్రాలు అందజేసేందుకు కృషి చేస్తామని ఏప్రిల్ 30న మండపేటలో నిర్వహించిన చేనేత సంఘాల ఆత్మీయ సమావేశంలో హామీ ఇచ్చారు.మండపేట నియోజకవర్గంలో 96 వేల మంది మహిళలకు ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తాం.
- 1.10 లక్షల మంది మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం. 55వేల మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తాం. టిడ్కో లబ్ధిదారుల రుణాలను రద్దు చేస్తాం.
- నియోజకవర్గంలోని వ్యవసాయ, వ్యవసాయాధారిత పరిశ్రమలు, ఇటుక బట్టీలు, కోళ్ల ఫారాల్లో పనిచేసే వారికి ఇళ్ల వద్ద సౌర విద్యుదుత్పత్తి ప్లాంట్లు ఏర్పాటు చేస్తాం. నియోజకవర్గంలోని 65 వేల ఎకరాలకు చెందిన 35 వేల మంది పాడి రైతులకు ప్రయోజనం చేకూరేలా సోలార్ పంపు సెట్లు ఏర్పాటు చేస్తాం.చిరుద్యోగులకు ప్రభుత్వ పథకాలను వర్తింపజేస్తాం. తాపేశ్వరం బైపాస్ రోడ్డు నిర్మిస్తాం.
- మారేడుబాక - మండపేట-రామచంద్రపురం కెనాల్ రోడ్డులో వంతెన నిర్మాణం పూర్తి చేస్తాం.

ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలి ప్రచారమా ?



రామచంద్రపురంలోని ఎంపీ బోస్ క్యాంపు కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులతో మాట్లాడుతున్న కో ఆర్డినేటర్ సూర్యప్రకాశ్

వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్

రామచంద్రపురం: ప్రజా సంక్షేమాన్ని అటకెక్కించిన కూటమి ప్రభుత్వం సిగ్గు లేకుండా 'ఇది మంచి ప్రభుత్వం' అంటూ ప్రచారానికి దిగడం ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనమని రామచంద్రపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ ధ్వజమెత్తారు. కె.గంగవరం మండల వైఎస్సార్ సీపీ సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ శ్రేణులతో ఆయన శుక్రవారం రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్‌చంద్రబోస్ క్యాంపు కార్యాలయంలో సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా సూర్యప్రకాశ్ మాట్లాడుతూ సూపర్ సిక్స్ అంటూ ప్రజలకు ఆశ కల్పించి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కేవలం పింఛన్లు ఇచ్చి మిగిలిన ఎన్నికల వాగ్దానాలను అటకెక్కించారని మండిపడ్డారు. ఈ కూటమి ప్రభుత్వంలో నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయన్నారు. కూటమి నేతలు ప్రజల కష్టాలను పట్టించుకోకుండా ఇది మంచి ప్రభుత్వం అంటూ ప్రచార కార్యక్రమాలు చేయడం సిగ్గుచేటు అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు సమస్యల్లో ఉన్న ప్రజలకు అండగా నిలవాలని కోరారు. గ్రామాల్లో కూటమి ప్రభుత్వం వైఫల్యాలను ఎండగట్టాలని, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పెట్టా శ్రీనివాసరావు, ఎంపీపీ పంపన నాగమణి, పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నిబద్ధతతో కూడిన సేవలతోనే గుర్తింపు

రాయవరం: ప్రతి ఉద్యోగి తన ఉద్యోగ జీవితంలో అంకితభావంతో కూడిన సేవలు గుర్తింపు ఇస్తాయని ఎంపీడీవో కొవ్వూరి నరేంద్రరెడ్డి అన్నారు. బదిలీపై వెళ్లిన హౌసింగ్ ఏఈ కొవ్వూరి శ్రీనివాసరెడ్డి అభినందన సభ శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీడీవో మాట్లాడుతూ హౌసింగ్ ఏఈగా శ్రీనివాసరెడ్డి అందించిన సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. అనంతరం ఏఈ శ్రీనివాసరెడ్డిని దుశ్శాలువా, జ్ఞాపిక, పూలమాలతో మండలస్థాయి అధికారులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈవోలు పి.రామలక్ష్మణమూర్తి, యరమాటి సూర్యనారాయణ, పంచాయతీ విస్తరణాధికారి శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చైతన్యకుమారి, ఏవో డి.శ్రీనివాస్, స్థానిక నేత వుండవిల్లి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



ఏఈ శ్రీనివాసరెడ్డిని సత్కరిస్తున్న ఎంపీడీవో నరేంద్రరెడ్డి తదితరులు

దసరా ఉత్సవాలకు రాట ముహూర్తం



ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో రాట ముహూర్తం చేస్తున్న పండితులు



చెల్లూరు అగస్త్యేశ్వరస్వామి ఆలయం వద్ద రాట మంచి పూజలు చేస్తున్న భక్తులు

రామచంద్రపురం రూరల్: దక్షిణకాశీ ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో వచ్చే నెల 3 నుంచి 12 వరకూ దేవీ శరన్నవరాత్ర ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు శుక్రవారం ఆలయ పండితులు ప్రత్యేక పూజలు చేసి దసరా ఉత్సవాలకు రాట ముహూర్తం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సీనియర్ అసిస్టెంట్ సూరపురెడ్డి వెంకటేశ్వరరావు (వెంకన్నబాబు), ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు రాట మంచి పూజలు

రాయవరం: మండలంలోని చెల్లూరు బాలాత్రిపుర సుందరీ సమేత అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం దసరా ఉత్సవాలకు రాట మంచి పూజలు చేశారు. ఉదయం 9.38 గంటలకు ఆలయ అర్చకుడు సాయిశర్మ ఆధ్వర్యంలో రాటకు పూజలు నిర్వహించారు. అనంతరం చలువ పందిళ్ల పనులు ప్రారంభించారు. దసరా ఉత్సవాలను పురస్కరించుకుని అమ్మవారికి రోజూ ప్రత్యేక అలంకరణలు, ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ తెలిపింది. కార్యక్రమంలో స్థానిక నేతలు చుండ్రు వీర్రాజు, దేవు శ్రీను, గుణ్ణం బాబి, బొంతు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు

- షెడ్డును తొలగించిన అధికారులు
- మొత్తం ఆక్రమణలు తొలగించాలంటూ బాధితుల ఆందోళన



దేవస్థానం భూమిలో ఆక్రమణను తొలగించి బాధితులను బయటకు పంపుతున్న పోలీసులు



చెరువు గట్టునే ఉన్న కిళ్లీ షాపును తొలగించని అధికారులు

కె.గంగవరం: ఆక్రమణల తొలగింపు పేరుతో గత కొనేళ్లుగా నివాసం ఉంటున్న షెడ్డును భారీ పోలీసు బందోబస్తు నడుమ దేవస్థానం సిబ్బంది కూలగొట్టేశారు. వివరాల్లోకి వెళితే..మండలంలోని కోటిపల్లిలో కొలువైన సోమేశ్వరస్వామి ఆలయానికి చెందిన సోమగుండం చెరువు తూర్పు గట్టున సుమారు 5 సెంట్ల భూమి ఆక్రమణకు గురైంది. దీనిపై స్థానికులు గత నెలలో నిర్వహించిన స్పందనలో జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అధికారులు ఆక్రమణల తొలగింపు పనులు చేపట్టారు.

తెల్లవారక ముందే..

ఉదయం 5 గంటలకే కోటిపల్లిలో సుమారు 200 మందికిపైగా పోలీసులు బందోబస్తు మధ్య దేవస్థానం అధికారులు ప్రొక్లెయిన్‌తో ఆక్రమణల తొలగింపు చర్యలు చేపట్టారు. దేవస్థానం భూమిలో ఉన్న షెడ్డులో నివాసం ఉంటున్న ఓలేటి లక్ష్మి, ఆమె కుటుంబ సభ్యులను బలవంతంగా ఇంట్లో నుంచి బయటకు పంపి షెడ్డును కూలగొట్టారు. దీంతో పాటు గట్టు పొడవునా ఉన్న గొడలు, చెత్తను తొలగించి సుమారు 5 సెంట్ల భూమిని దేవస్థానం స్వాధీనం చేసుకుంది. కాగా గట్టు పక్కనే ఉన్న సిమెంట్ రోడ్డుకు అవతల ఉన్న తన నివాసాన్ని కూలగొట్టారు కాని గట్టు పక్కనే ఉన్న కిళ్లీ షాపును ఎందుకు తొలగించలేదని, చెరువు చుట్టూ ఉన్న ఆక్రమణలు తొలగించాలని బాధితులు గొడవకు దిగారు. దీంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. పోలీసులు బాధితులను పక్కకు పంపి ఆక్రమణలు తొలగించారు. లక్ష్మికి గత ప్రభుత్వంలో ఇంటి స్థలం మంజూరైందని, దానిని అప్పగిస్తామని తహసీల్దార్ సూర్యారావు బాధితులకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో డీఎస్పీ బి.రామకృష్ణ, సీఐలు కె.అశోక్‌కుమార్, పి.దొరరాజు, ఎస్సై జానీ బాషా, ఎండోమెంట్ ఏసీ లక్ష్మీనారాయణ, రామచంద్రపురం తనిఖీదారు బాలాజీ, ఆలయ ఈఓ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా మండల స్థాయి క్రీడాపోటీలు



గొల్లపాలెంలో లాంగ్ జంప్ చేస్తున్న క్రీడాకారుడు



కపిలేశ్వరపురంలో కబడ్డీ ఆడుతున్న విద్యార్థినులు

కపిలేశ్వరపురం: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడా పోటీలు శుక్రవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించారు. ఎంఈఓ కె.తాతారావు పోటీలను ప్రారంభించారు. అండర్- 17 బాలుర విభాగం ఖోఖో పోటీలో కపిలేశ్వరపురం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు విన్నర్స్‌గానూ, నల్లూరు విద్యార్థులు రన్నర్స్‌గానూ నిలిచారు. కబడ్డీలో కపిలేశ్వరపురం విన్నర్స్‌గానూ, వల్లూరు విద్యార్థులు రన్నర్స్‌గానూ, వాలీబాల్‌లో వల్లూరు విన్నర్స్‌గానూ, మాచర విద్యార్థులు రన్నర్స్‌గానూ బాలికల ఖోఖో, కబడ్డీ పోటీల్లో కపిలేశ్వరపురం విన్నర్స్‌గానూ, అంగర విద్యార్థులు రన్నర్స్‌గానూ, వాలీబాల్‌లో వల్లూరు విన్నర్స్‌గానూ కపిలేశ్వరపురం విద్యార్థులు రన్నర్స్‌గానూ నిలిచారు. అండర్ 14 బాలుర విభాగం ఖోఖో, వాలీబాల్ పోటీల్లో కపిలేశ్వరపురం విన్నర్స్‌గానూ, నల్లూరు విద్యార్థులు రన్నర్స్‌గానూ, కబడ్డీలో అంగర విన్నర్స్‌గానూ, కపిలేశ్వరపురం రన్నర్స్‌గానూ నిలిచారు. బాలికల విభాగం ఖోఖో పోటీల్లో కపిలేశ్వరపురం విన్నర్స్‌గానూ, అంగర రన్నర్స్‌గానూ, కబడ్డీలో కపిలేశ్వరపురం విన్నర్స్‌గానూ, వల్లూరు రన్నర్స్‌గానూ, వాలీబాల్ పోటీల్లో వల్లూరు విన్నర్స్‌గానూ, కపిలేశ్వరపురం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రన్నర్స్‌గానూ నిలిచారు. విద్యార్థులను ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు అభినందించారు. వ్యాయామోపాధ్యాయులు గుబ్బల వేణుగోపాలరావు, ముత్తా సత్యనారాయణ, మేకా సత్యనారాయణ, దుర్గాప్రసాద్, బేగం, రవికుమార్ వ్యవహరించారు.

విద్యార్థుల ఉజ్వల భవితకు క్రీడలు దోహదం

కాజులూరు: విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు క్రీడలు ఎంతగానో దోహదపడతాయని మండల విద్యాశాఖాధికారి జాన్ అన్నారు. గొల్లపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ గ్రౌండ్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే మండల స్థాయి క్రీడాపోటీలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా స్కూల్ హెచ్ఎం ఎస్ఎస్‌బీ సుశీలామణి అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకూ ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. క్రీడలతో మానసిక ప్రశాంతత కలుగుతుందని తెలిపారు. మండల స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ జిజేఆర్ఎస్ కౌర్ మాట్లాడుతూ తొలి రోజు పోటీల్లో 250 మంది క్రీడాకారులు పాల్గొన్నారని చెప్పారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, షటిల్, యోగా, అథ్లెటిక్స్, లాంగ్ జంప్, చెస్ పోటీలు నిర్వహించి క్రీడాకారులను ఎంపిక చేశామన్నారు. వీరందరూ రామచంద్రపురంలో జరిగే నియోజకవర్గస్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ కాలిశెట్టి సత్యం, స్కూల్ పీడీ సునీల్‌కుమార్, స్థానిక నాయకులు అంగర కృష్ణ, నున్న కాశీవిశ్వనాథం, డేగల సతీష్, వడ్డి శ్రీను, అంగర శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలి

అంబాజీపేట: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా చదువుకుంటే మంచి మార్కులు తెచ్చుకుంటారని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సమగ్ర శిక్షా కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి బీవీవీ సుబ్రహ్మణ్యం అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌ను శుక్రవారం ఆయన పరిశీలించారు. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మానసిక ప్రశాంతతో చదువుకోవడం వల్ల ఫలితాలు ఉంటాయన్నారు. ప్రతి సబ్జెక్టును కష్టపడి, ఇష్టంగా చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. జిల్లాలో 22 మండలాల ఎంఈఓల నుంచి తరలించిన షూ సైజు సరపడని జతలను స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో భద్రపరుస్తున్నామన్నారు. విద్యార్థులు ఇచ్చిన సైజు, ఇండెంట్‌ల ప్రకారం త్వరలో అన్ని మండలాల పాఠశాలలకు టైలను పంపిణీ చేస్తామన్నారు. విద్యార్థులకు అందజేసిన యూనిఫాం, టై, బెల్ట్, షూలతో రోజూ పాఠశాలకు హాజరు కావాలన్నారు. అనంతరం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో పౌష్టికాహారంతో కూడిన భోజనాన్ని అందిస్తున్నారని విద్యార్థులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. మెనూ ప్రకారం రుచికరమైన వంటకాలను తయారు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు వడ్డించి వారితో కలసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం కడలి సాయిరామ్, స్టాఫ్ సెక్రటరీ వెన్నపు సత్యనారాయణ, సీఆర్పీలు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎనిమిది మంది ఎంపిక

పి.గన్నవరం: ముంగండ జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి ఎనిమిది మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి అండర్-19 సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపిక అయ్యారని పాఠశాల హెచ్ఎం గోకరకొండ కనకదుర్గ తెలిపారు. రామచంద్రాపురంలో ఇటీవల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరచడంతో వీరిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసారని ఆమె వివరించారు. సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపికైన మట్టపర్తి లాస్యశ్రీ, మట్టపర్తి బాగ్యశ్రీ, మట్టపర్తి మాధవి, తొత్తరమూడి సీతారత్నం, తెలగారెడ్డి త్రిషలక్ష్మి, చిట్టూరి సాయన్‌రోజ, పాలూరి శ్రీరామ వంశీ, మొల్లేటి హర్షవర్ధన్‌లను అధ్యాపక సిబ్బంది అభినందించారు.